క్లుప్తంగా

ప్రభుత్వ వైద్యశాలలో అన్నదానం



నరసరావుపేట: శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం స్టేషన్ రోడ్డులోని ప్రభుత్వ వైద్యశాలలో 160 మందికి ఉచిత అన్నదానం నిర్వహించారు. పేషంట్లకు తోడుగా వచ్చే వారి బంధువులకు అన్నదానం చేశారు. ప్రతిరోజూ తమ సంస్థ తరపున ప్రభుత్వ వైద్యశాలలో నిత్య అన్నదానం చేస్తున్నట్లు కన్వీనర్ ఏవీ హరనాథ బాబు వెల్లడించారు. సభ్యులు బి.నాగరాజు, ఆర్.సుబ్బారావు, కె.హనుమంతరావు పాల్గొన్నారు.

పెన్షనర్ల దినోత్సవాన్ని జయప్రదం చేయండి

వినుకొండ టౌన్: ఆల్ ఇండియా పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఈ నెల 17న నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి కాళ్ల కృష్ణమూర్తి గురువారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ భవనంలో పెన్షనర్ల దినోత్సవంతోపాటు 16వ వార్షిక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి అతిథులుగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ షేక్ దస్తగిరి, తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎస్టీటీఓ, మున్సిపల్ కమిషనర్ డి. వెంకయ్య, ఎస్‌బీఐ మేనేజర్‌తోపాటు పల్నాడు జిల్లా పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో భాగంగా 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్ల దంపతులు 30 మందికి సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వినుకొండ నియోజక వర్గంలోని 5 మండలాల పెన్షనర్లు తప్పనిసరిగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఆశించిన మేర పంట దిగుబడి



ఈపూరు: తుఫాన్ ధాటికి వరి పొలాలు పడిపోయినా ఆశించిన దానికంటే దిగుబడి ఎక్కువగా వస్తుందని మండల వ్యవసాయాధికారి రామారావు అన్నారు. పంట కోత ప్రయోగంలో భాగంగా మండలంలోని కొచ్చర్ల గ్రామంలో అయినాల కుమారికి చెందిన పొలంలో 5-5 కొలతల విస్తీర్ణంలో వరి కంకులను నూర్చగా 22.300 కేజీలు ధాన్యం వచ్చినట్లు ఆయన తెలిపారు. దీన్ని ప్రకారం ఎకరాకు 49 బస్తాలు రావచ్చని అన్నారు. శ్రీనగర్, ఇనిమెళ్ల గ్రామాల్లో కూడా పంట కోత ప్రయోగంలో అనుకున్న దానికంటే ఎక్కువ ధాన్యం వచ్చాయని, ఈ ఏడాది వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్నప్పటికీ దిగుబడి ఎక్కువగానే వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కిషోర్ కుమార్, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కొండ మీద వేంచేసిన గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానం పునఃనిర్మాణానికి పట్టణానికి చెందిన యాదాల బాలయ్య, నిర్మల దంపతులు, కుటుంబసభ్యులు ఒక లక్షా 116 రూపాయలను వినుకొండ పట్టణ అభివృద్ధి సేవా సంఘం సభ్యులకు అందజేశారు. అనంతరం దాతలను సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు పెండేల వెంకటపుల్లారావు, చైర్మన్ పులిపాటి రామారావు, కార్యదర్శి జాజుల మాల్యాద్రి, కోశాధికారి రెడ్డి నగేష్ బాబు, చందోలు మల్లికార్జునరావు, గజవల్లి నాగపవన్‌కుమార్, సహాయకార్యదర్శి దండు చెన్నయ్య, కన్నెగండ్ల అనంత కోటేశ్వరరావు, ఈసీ మెంబర్స్ ములకా రామతులసిరెడ్డి, తెలికేపల్లి వెంకటేశ్వర్లు, ఊట్ల సుబ్బారావు, బాణావత్ గోవిందునాయక్ పాల్గొన్నారు.

చకచకా రహదారి నిర్మాణం



రహదారి నిర్మాణానికి వేసిన గ్రావెల్

వినుకొండ (నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలం నాగులవరం- అద్దంకి ప్రధాన రహదారి నుంచి రావిచెట్టు నుంచి మదమంచిపాడు ఆంజనేయ స్వామి దేవస్థానం వరకు నూతన రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 2.2 కిలోమీటర్ల పొడవున నూతన రోడ్డు పనులు జరుగుతున్నాయి. రూ.63 లక్షల నాబార్డు నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చొరవతో వినుకొండ రూరల్ మండలంలో ఆరుచోట్ల రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. మెరుగైన రవాణా సౌకర్యం కోసం త్వరలోనే రోడ్డును అందుబాటులో తీసుకొస్తామని అధికారులు తెలిపారు.



గ్రావెల్‌ను చదును చేస్తున్న పొక్లయినర్

అవినీతి, దోపిడీ గురించి ప్రత్తిపాటి మాట్లాడటం విడ్డూరం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు



మాట్లాడుతున్న మల్లెల రాజేష్ నాయుడు

చిలకలూరిపేట: మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అవినీతి... దోపిడీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు విమర్శించారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి విడదల రజినిపై ప్రత్తిపాటి ఆరోపణలు చేసిన నేపథ్యంలో రాజేష్‌నాయుడు తీవ్రంగా స్పందించారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ప్రత్తిపాటి పుల్లారావు కేవలం పదవీ వ్యామోహంతోనే ముఖ్యమంత్రిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్తిపాటి అవినీతి చిట్టా తమ వద్ద ఉందని హెచ్చరించారు.

2014 ఎన్నికల్లో ఎవరి కాళ్లు పట్టుకొని ప్రత్తిపాటి గెలుపొందారో పునరాలోచించుకోవాలని హితవు పలికారు. సీసీఐ, అగ్రిగోల్డ్, అక్రమ మైనింగ్ ఇలా చెప్పుకుంటూ పోతే ప్రత్తిపాటి అవినీతి అభివర్ణించేందుకు పేజీలు చాలవని ఎద్దేవా చేశారు. సీట్ల మార్పిడిపై పుల్లారావు మాట్లాడం విడ్డూరంగా ఉందని, ఆయనకు వచ్చే ఎన్నికల్లో చిలకలూరిపేట నియోజకవర్గానికి టీడీపీ టికెట్ దక్కుతుందన్న నమ్మకం ఉందా అని ప్రశ్నించారు. గుంటూరు పశ్చిమలో విడదల రజిని అయితేనే గెలుపొందుతారనే నమ్మకంతోనే సీఎం వైఎస్ జగన్ అక్కడ ఆమెను నియమించారని వెల్లడించారు. అంతేగాని ఓడిపోయి ఇంట్లో కూర్చున్న ప్రత్తిపాటిని చూసి భయపడి వెళ్లలేదని తెలిపారు. ఐదు సంవత్సరాలుగా పార్టీ పట్టణ అధ్యక్షుడిని నియమించుకోలేని దుస్థితి ఉన్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వాడుకొని వదిలివేయడం టీడీపీకి, ప్రత్తిపాటి పుల్లారావుకు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదన్నారు. పొత్తులో ఉన్న జనసేన పార్టీ నాయకులకు స్థానికంగా ఏ స్థానం కల్పిస్తారో బహిరంగంగా చెప్పే దమ్ము పుల్లారావుకు ఉందా అని ప్రశ్నించారు.

ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌తో భేటీ

అనంతరం రాజేష్‌నాయుడు గురువారం పార్టీ కృష్ణా, ఎన్‌టీఆర్, గుంటూరు జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌ను గురువారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మల్లెల రాజేష్‌నాయుడుకు పదవి వరించటం పట్ల మర్రి రాజశేఖర్ ఆయనకు అభినందనలు తెలిపారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా వలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని బొల్లా బ్రహ్మనాయుడు కన్వెన్షన్ హాల్‌లో ఈపూరు మండలంలోని అన్ని సచివాలయాల వలంటీర్లు, గృహసారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్స్‌తో ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కరోనా సమయంలో వలంటీర్లు చేసిన సేవలు మరువలేనివన్నారు. అలాగే వారు పథకాలను ప్రతి గడపకు అందిస్తున్న తీరు హర్షణీయమన్నారు. ఇలాగే రానున్న రోజుల్లో కూడా ప్రభుత్వం అందజేసే పథకాలు ప్రజలకు ఇంకా చేరువ చేసేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వ కార్యక్రమం అయిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తనకు ఎంతో సహకరించి త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకారం అందించారన్నారు. అలాగే వలంటీర్లకు ఇద్దరు గృహసారథులను నియమించి ప్రభుత్వ పథకాలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఈపూరు మండలస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాలలపాలెం సర్పంచ్ మృతికి ఎమ్మెల్యే నివాళి



రవి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడ

వినుకొండ(నూజెండ్ల): రూరల్ పరిధిలోని జాలలపాలెం గ్రామసర్పంచ్ గోనుగుంట్ల రవి గుండెపోటుతో మరణించారు. సమాచారం మేరకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గ్రామంలోని రవి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు. రవి అత్యంత ఆప్తుడని, వారిని సొంత కుటుంబ సభ్యుడిగానే భావిస్తానని, వారు లేరన్నది జీర్ణించు కోలేకపోతున్నామన్నారు. రవి మరణం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ఎల్లప్పుడు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ అనుసరించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- టౌన్ బాప్టిస్టు చర్చి, యునైటెడ్ ఫాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సెమిక్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో కేకు కట్‌చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, ఫాస్టర్లు

నరసరావుపేట: ఏసుక్రీస్తు సూచించిన ప్రేమ, దయా, క్షమాగుణం లాంటి బోధనలు ప్రతి ఒక్కరికీ అవసరమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి మేరీకర్జ్ సెంటినరీ టౌన్ బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో హర్డు కాంపౌండ్, గురువారం 24వార్డు బాలయ్యనగర్‌లోని చర్చిలో యునైటెడ్ ఫాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమిక్రిస్మస్ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై క్రీస్తు సందేశం ఇచ్చారు. క్రీస్తు అంటే అభిషక్తుడని, మస్ అంటే ప్రార్థన అని అభిషక్తుడి ప్రార్థన అని వివరించారు. రక్తపాతం ద్వారా సాధించుకున్న రాజ్యాలు కంటే ప్రేమనే పునాదిగా చేసుకున్న ఏసుక్రీస్తు సాధించిన రాజ్యమే శాశ్వతమని 18వ శతాబ్దంలో నెపోలియన్ బోనపార్టీ అనే రాజు చెప్పాడన్నారు. తప్పుచేస్తే క్షమించే గుణం కలిగి ఉండాలని ఏసుక్రీస్తు చెప్పాడన్నారు. ఫాస్టర్ అబ్రహం కోరిక మీదట 108 మంది ఫాస్టర్లకు ఇళ్లపట్టాలు అందజేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఈసందర్భంగా క్రిస్మస్ కేకును కట్‌చేసి సోదరులందరికీ క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియ చేశారు. ఫాస్టర్లచే ప్రార్థన స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో సంరక్ష సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి ఎంఆర్ సుశీల్‌కుమార్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు కిషోర్, మాదిగ సంక్షేమ కార్పొరేషన్ డైరక్టర్ కందుల ఎజ్రా, జిల్లా ఎస్‌సీసెల్ మెంబరు మల్లెల అశోక్, బాప్టిస్టు చర్చి కార్యవర్గ అధ్యక్షుడు పంగులూరి విజయకుమార్, వైఎస్సార్‌సీపీ ఎస్‌సీసెల్ రాష్ట్ర కార్యదర్శి గంటెనపాటి గాబ్రియేలు, యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జి.అచ్యుతరావు, 24వ వార్డు ఇన్‌చార్జి సానికొమ్ము సుబ్బారెడ్డి, గుండాల వెంకటేష్, ఫాస్టర్లు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో వికసిత భారత్

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల, చిరుమామిళ్ళ గ్రామాల్లో శుక్రవారం వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించి చేరువచేయనున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటలకు నాదెండ్ల, 4 గంటలకు చిరుమామిళ్ళ గ్రామాల్లో కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. 17 సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరించనున్నారు. అధికారులు, నాయకులు పాల్గొంటరన్నారు.

సీఐగా బాధ్యతలు చేపట్టిన భాస్కర్



నరసరావుపేట టౌన్: టూటౌన్ సీఐగా ఎ. భాస్కర్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. సీసీఎస్ సీఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై టూటౌన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా సీఐ భాస్కర్ మాట్లాడుతూ టూటౌన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు. మొదట జిల్లా ఎస్పీ వై. రవిశంకర్‌రెడ్డిను మర్యాద పూర్వకంగా కలిశారు.

మళ్లీ అధికారంలోకి వచ్చేలా కృషి చేయండి

నూతన పార్టీ బాధ్యులకు సూచించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి



పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేతో నూతన పార్టీ బాధ్యులు

నరసరావుపేట: రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. పట్టణానికి చెందిన గుజ్జర్లపూడి ఆకాష్ వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగానికి కార్యదర్శిగాను, ఆళ్ల మణికంఠరెడ్డి సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు వారు గురువారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను వారు దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు గోగుల శంకరయాదవ్, మద్దిరెడ్డి నరసింహారెడ్డి, గంటెనపాటి గాబ్రియేలు పాల్గొన్నారు.

పంటల నష్టం వివరాలు నమోదు



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఏవో సుగుణాబేగం

వినుకొండ(నూజెండ్ల): మిచాంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులు, పంట వివరాలను రైతు భరోసా కేంద్రంలో నమోదు చేయడం జరుగుతుందని ఏవో షేక్ సుగుణాబేగం తెలిపారు. నూజెండ్ల మండలంలోని లక్ష్మీపురం, రవ్వారం, ముప్పరాజువారిపాలెం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఆమె పరిశీలించారు. వ్యవసాయ సిబ్బంది నమోదు చేస్తున్న పంట నష్టం అంచనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులు పంట వివరాలను ఈ నెల 18వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని, ఆయా జాబితాలను సామాజిక తనిఖీ నిమిత్తం ఆర్‌బీకేల్లో ఈ నెల 18 నుంచి 22 వరకు ప్రదర్శనగా ఉంచుతామని వివరించారు. పంట నష్టం నివేదిక ఫిర్యాదులను ఈ నెల 22వ తేదీ వరకు స్వీకరిస్తారని వివరించారు. ఈ నెల 23న పంట నష్టపోయిన రైతుల జాబితాలను ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో ఎలీషా, ఆర్‌బీకే సిబ్బంది కోటేశ్వరరావు, సునీత కుమారి పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు

నకరికల్లు: ఎరువులను ఎమ్మార్పీకన్నా అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు హెచ్చరించారు. నకరికల్లులోని పలు ఎరువుల, పురుగుమందుల దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్‌లు పరిశీలించారు. ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల బిల్లు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్, గోడౌన్‌లలోని ఎరువులను తనిఖీ చేశామన్నారు. ఎరువులు, పురుగుమందులను విక్రయించే క్రమంలో నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు.

అధిక ధరలకు విక్రయించిన దుకాణదారులపై ఎఫ్‌సీవో 1985 ప్రకారం చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. రైతులకు ఇచ్చే విక్రయ రసీదుపై రైతులు కొనుగోలు చేసిన ఎరువుల వివరాలు, రైతు సంతకం, అమ్మినవారి సంతకం, లాట్‌నంబర్ తప్పనిసరిగా పొందుపరచాలన్నారు.

గణపవరానికి దొంగల బెడద

భయభ్రాంతులకు గురౌతున్న స్థానికులు



నాదెండ్ల: పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన గణపవరం గ్రామంలో రోజు రోజుకు దొంగతనాలు పెరుగుతున్నాయి. తాజాగా బుధవారం ఓ వ్యక్తి జాతీయ రహదారిపై నడిచి కంపెనీకి డ్యూటీకి వెళ్తున్నాడు. ఇరువురు వ్యక్తులు బైక్‌పై వచ్చి అగ్గిపెట్టె కావాలని అడిగారు. తన వద్ద లేదని చెప్పటంతో చొక్కాపట్టుకుని లాగి జేబులో ఉన్న రూ.2 వేలు నగదు, సెల్ ఫోన్‌తో ఉడాయించారు. ఉదయం పూట వెళ్లే వాకర్స్‌కు ఇదే తంతు ఎదురౌతోంది. నెలరోజుల వ్యవధిలోనే రెండు బైక్‌లు చోరీ అయ్యాయి. ఆతర్వాత ఒక స్విఫ్ట్ డిజైర్ కారు చోరీకి గురైంది. గత వారం ఇరువురు గుంటూరు నుంచి వచ్చిన వ్యక్తులు వేలూరు వెళ్లే రోడ్డులో ఉన్న రెండు ఇళ్ల తాళాలు పగలగొట్టి ప్రవేశించగా, రెండు ఇళ్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. అదే రోజు ఓ ఇంటి ముందు ఉన్న బైక్ తాళాలు పగలగొట్టే ప్రయత్నం చేయగా, దుండగుడిని స్థానికులు పట్టుకుని చెట్టుకు కట్టి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. మరో వ్యక్తి పరారయ్యాడు. అవ్యక్తి కోసం పోలీసులు గాలించిన దొరకలేదు. పోలీసుల అదుపులో ఉన్న దొంగపై గుంటూరులో పలు చోరీ కేసులు నమోదై ఉన్నట్లు సమాచారం. ఇతన్ని గుంటూరు పోలీసులకు అప్పగించారు.

బుధవారం నాలుగో సచివాలయంలో అధికారులను స్థానిక మహిళలు దొంగతనాలు నిత్యం జరుగుతున్నాయంటూ దృష్టికి తెచ్చారు. దీనిపై మున్సిపల్ వైస్ ఛైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, ఎస్సై జె బలరామ్‌రెడ్డికి ఫోన్ చేసి గణపవరంలో రాత్రి దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, రాత్రిపూట సిబ్బందిని పెంచాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అగ్నిప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ చేయూత

వంటపాత్రలు, బియ్యం, హైజీన్ కిట్లు అందజేత




బాధితులకు వంటపాత్రలు అందజేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

నరసరావుపేట: పట్టణంలోని ఒకటో వార్డులో విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదానికి ఇల్లు దగ్ధమైన సంఘటనలో బాధితులకు గురువారం ఇండియన్ రెడ్‌క్రాసు చైర్మన్ కంజుల జగన్ మోహన్ రెడ్డి, సభ్యులు పరామర్శించారు. జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు బాధితుడు అంబటి శశికుమార్, కుటుంబ సభ్యులకు వంటపాత్రలు, టార్పాలిన్లు, హైజీన్ కిట్లు, బియ్యం అందజేశారు. జిల్లా వైస్ చైర్మన్ పీవీఎం శరత్ బాబు మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు, వరదలు వంటి విపత్తుల సమయాల్లో రెడ్‌క్రాస్ ఎల్లపుడూ సేవలను అందిస్తుందన్నారు. రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు కేయంయస్‌వి శ్రీనివాస గుప్తా, బత్తుల మురళి, డాక్టర్ రేహమతుల్లా, ఒకటో వార్డు ఇన్‌చార్జి రామిసెట్టి కొండ,షేక్ గౌస్ పాల్గొన్నారు.

సమన్వయంతో మెరుగైన పాలన అందించాలి

ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్



మాట్లాడుతున్న ఎంపీపీ సుహాసిని

శావల్యాపురం: అధికారుల సమన్వయంతో తమ విధులు అంకిత భావంతో నిర్వహించి ప్రజలకు మెరుగైన సుపరిపాలన అందించాలని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మించాగ్ తుఫాన్ ప్రభావం ధాటికి పంటలు నష్టం వాటిల్లిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిహారం పారదర్శకంగా అందేలా చూడాలన్నారు. నాడు-నేడు మన బడి పథకంలో భాగంగా 34 ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటి వరకు రూ.8 కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. గ్రామాల్లో సమస్యలకు తావులేకుండా ప్రజాప్రతినిధులు అధికారులు సంయుక్తంగా ప్రజలకు మంచి పాలన అందించాలన్నారు. గ్రామసచివాలయాలు, రైతుభరోసా, వైఎస్సార్ క్లీనిక్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు మరింత చెరువులోకి తెచ్చిన ప్రభుత్వ సేవలు పేద ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈపూరు మార్కెట్ చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీలు చెన్నంశెట్టి రంగారావు, నంబూరి ప్రభావతి, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు మండల గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణల చెర నుంచి ప్రభుత్వ భూమిని కాపాడారు!

వివాదాస్పద భూమిలో ప్రభుత్వ పోరంబోకుగా బోర్డు ఏర్పాటు



వివాదాస్పద భూమిలో మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నరసరావుపేట:.స్థానిక బరంపేటలో మున్సిపల్ ప్రైమరీ స్కూలు, కత్వవ వాగు మద్యనున్న ప్రభుత్వ పోరంబోకు స్థలాన్ని గురువారం మున్సిపల్, రెవెన్యూ అధికారులు సందర్శించారు. కోట్ల విలువైన ఆ స్థలంలో బుధవారం కొంతమంది ప్రొక్లయినర్‌తో చదును చేస్తుండగా ఆ స్థలం తమదని, ఎన్నో ఏళ్లుగా మట్టితోలించి ఆపుకున్నామంటూ సమీప ప్రాంతాలకు చెందిన మహిళలు అడ్డుకున్నారు. దీనిపై ఆ మహిళలకు మద్దతుగా టీడీపీ, జనసేన నాయకులు ప్రవేశించి కొంతమంది వైఎస్సార్‌సీపీ నాయకులు ఆక్రమిస్తున్నారంటూ ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సూచన మేరకు తహసీల్దార్ ఆర్‌వీ రమణా నాయక్, టీపీవో నరసింహారావు తమ సిబ్బందితో ఆ ప్రదేశాన్ని సందర్శించి సర్వే నంబరు 102/1లో ఉన్న ఆ స్థలం ప్రభుత్వ పోరంబోకు అని, దానిని ఎవరైనా ఆక్రమించాలని ప్రయత్నిస్తే చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

ఆక్రమణ నుంచి కాపాడండి: వైఎస్సార్‌సీపీ నాయకులు

ఇటీవల మిచాంగ్ తుపాన్ కారణంగా ఈ స్థలంలో భారీగా వర్షపు నీరు చేరింది. దీనిమీదుగానే కాపు ఆరామక్షేత్రానికి వెళ్లాల్సి ఉంది. ఈ విషయం ఎమ్మెల్యే గోపిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా శుభ్రం చేయించాలని చెప్పిన మీదటనే తాము ప్రొక్లయినర్‌తో ముళ్లపొదలు తొలగించే పని చేశామని ఆ ప్రాంత వైఎస్సార్‌సీపీ నాయకుడు కంచర్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. అధికారులు పరిశీలించి గతంలో పేదలకు ఇచ్చిన స్థలం పోను మిగతా స్థలాన్ని స్వాధీనం చేసుకొని కాపాడాలని కోరారు. టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నట్లుగా ఈ స్థలం తమకు అవసరంలేదని, ఆ ఆలోచన తమకు లేదన్నారు. నాయకులు రామిశెట్టి కొండా, మాజీ కౌన్సిలర్ సయ్యద్‌బాజి, షేక్ మాబు మరికొందరు పాల్గొన్నారు.

కారుఢీకొని తండ్రీ కొడుకులకు గాయాలు

నాదెండ్ల: జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుండి కారు ఢీకొన్న ఘటనలో తండ్రీ కొడుకులకు గాయాలైన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గణపవరం శాంతినగర్‌లో నివాసం ఉండే వంగర కోటేశ్వరరావు చిలకలూరిపేట ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తుంటాడు. బుధవారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో కుమారుడు మురళీకృష్ణ తన బైక్‌ను డిపో వద్దకు తీసుకొచ్చి తండ్రిని ఎక్కించుకుని గణపవరం వెళ్తున్నాడు. గణపవరం కుప్ప గంజివాగు బ్రిడ్జిపై రాగానే చిలకలూరిపేట నుంచి గుంటూరువెళ్తున్న కారు ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న తండ్రీ కొడుకులు ఎగిరి కొంతదూరంలో పడ్డారు. ద్విచక్ర వాహనం కూడా పదడుగుల మేర ఈడ్చుకెళ్లింది. గాయాలైన ఇరువురినీ చిలకలూరిపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దీనిపై వంగర కోటేశ్వరరావు కుమార్తె పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు స్వాధీనం చేసుకుని నాదెండ్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు.